www.kalamdaily.com

కలం

ప్రజల గళం...

Follow on: Kalamtelugu

ఆదివారం
08-02-2026

360° SINGLE PAGE TOPIC
బెట్టింగ్

నెట్టింట బెట్టింగ్ బాంబ్

నట్టింట కూలుతున్న బతుకులు

ఇల్లీగల్ యాప్స్‌తో బుకీల దందా.. ఆకర్షించేలా ప్రమోషన్లు, ప్రత్యేక ఆఫర్లు

క్రికెట్ సీజన్‌లో విచ్చలవిడిగా పందేలు.. కోట్లకు కోట్లు కొల్లగొడుతున్న నిర్వాహకులు

ఊరిస్తుంది.. మురిపిస్తుంది.. వంద రూపాయలు పెడితే చాలు క్షణాల్లో వేలకు వేలు, లక్షలకు లక్షలు మీ అకౌంట్‌లో పడుతాయని మైమరిపిస్తుంది. ఈజీ మనీ కోసం నమ్మామా.. ఉన్నదంతా ఊడ్చేస్తుంది. బతుకును బస్టాండ్ చేస్తుంది. నెట్టింట తిష్ట వేసిన బెట్టింగ్ బాంబ్ ఇదీ! నట్టింట ప్రాణాలను బలితీసుకుంటున్నది!! ఆన్‌లైన్ బెట్టింగ్ మాయలో ముఖ్యంగా యువతరం బలిపశువుగా మారిపోతున్నది. క్రికెట్ సీజన్‌లో ఈ దందాకు అడ్డూ అదుపే ఉండటం లేదు. పూటకో ఇల్లీగల్ యాప్ పుట్టుకొస్తున్నది. ఏటా రెండు తెలుగు రాష్ట్రాల్లోనే రూ. 50 వేల కోట్ల బెట్టింగ్స్ జరుగుతున్నాయి. ఇందులో 99 శాతం మంది సర్వం కోల్పోయి.. ఆగమవుతున్నారు. బెట్టింగ్ యాప్స్, దందాపై కలం '360 డిగ్రీస్'..

- తెలంగాణ బ్యూరో, కలం

ఏటా రూ.12 లక్షల కోట్ల దందా

దేశంలో చట్టవిరుద్ధమైన బెట్టింగ్ మార్కెట్ అత్యంత వేగంగా వృద్ధి చెందుతున్నది. క్రికెట్ బెట్టింగ్, ఆన్‌లైన్ గేమింగ్ టర్నోవర్ ఏడాదికి సుమారు రూ.8.5 లక్షల కోట్ల నుంచి రూ.12.5 లక్షల కోట్ల వరకు ఉంటుందని ఫెడరేషన్ ఆఫ్ ఇండియన్ ఛాంబర్స్ ఆఫ్ కామర్స్ అండ్ ఇండస్ట్రీ (ఫిక్కీ), ఇతర సంస్థలు అంచనా వేస్తున్నాయి. ఇందులో 80% పైగా లావాదేవీలు అన్ అఫీషియల్ (బుకీల ద్వారా) జరగడంతో ప్రభుత్వానికి ఎలాంటి పన్ను ఆదాయం రాదు. తెలుగు రాష్ట్రాల్లోనూ బెట్టింగ్ సంస్కృతి గ్రామ స్థాయికి పాకింది. తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ కలిపి ఏడాదికి సుమారు రూ.50 వేల కోట్ల నుంచి 80 వేల కోట్ల వరకు బెట్టింగ్ వ్యాపారం జరుగుతున్నట్లు నివేదికలు చెప్తున్నాయి. ఒక్క ఐపీఎల్ సీజన్‌లో ఒక్కో రాష్ట్రం నుంచి రోజుకు రూ.500 నుంచి రూ.1,000 కోట్ల లావాదేవీలు జరుగుతాయి. ప్రపంచవ్యాప్త బెట్టింగ్, జూదం మార్కెట్ విలువ ఏడాదికి రూ.42 లక్షల కోట్ల నుంచి 58 లక్షల కోట్ల మధ్యలో ఉంది.

- తెలుగు రాష్ట్రాల్లో ఏటా సుమారు రూ.15వేల నుంచి 20వేల కోట్లు సామాన్యుల జేబుల నుంచి బుకీల చేతుల్లోకి వెళ్తున్నాయి.
- ఆన్‌లైన్ యాప్స్ నిర్వహించే వారు లాభాలు రాగానే అకౌంట్లు బ్లాక్ చేయడం లేదంటే యాప్ క్లోజ్ చేయడం వంటి ఎగ్జిట్ స్కామ్స్ ద్వారా ఏటా వేల కోట్లు దోచుకుంటున్నారు.

క్రికెట్ చుట్టే బెట్టింగ్!

దేశంలో భారీగా బెట్టింగ్ క్రికెట్ పైనే జరుగుతుంది. మొత్తం బెట్టింగ్ మార్కెట్‌లో సుమారు 90 శాతం దీనిదే. ఐపీఎల్, వరల్డ్ కప్ మ్యాచ్‌లు, ఇండియా–పాకిస్తాన్ మ్యాచ్‌లపై పెద్ద ఎత్తున దందా నడుస్తుంది. ఇప్పుడు ట్వీ20 వరల్డ్ కప్ సీజన్ కావడంతో ఇల్లీగల్ యాప్స్ లో యువతను బుకీలు ఊరిస్తున్నారు.

- ఇండియాలో ఏటా 10 లక్షల కోట్ల వరకు బెట్టింగ్స్ క్రికెట్‌పైనే జరుగుతున్నాయని పలు అంతర్జాతీయ సంస్థలు చెప్తున్నాయి.
- ఫోర్ కొడితే పది వేలు, సిక్స్ కొడితే 20 వేలు.. రన్ ఔట్‌కు 20 వేలు, విన్ అయితే 50 వేలు.. ఇలా ఒక్కో దానికి ఒక్కో రేటును యాప్స్‌లో ఫిక్స్ చేసి యువతను ఉచ్చులోకి లాగుతున్నారు.
- టీ20 వరల్డ్ కప్ నెలరోజుల పాటు జరిగితే.. అన్ని రోజులూ బెట్టింగ్స్ దందా జోరుగా నడుస్తుంది. హైదరాబాద్, విశాఖపట్నం వంటి నగరాలతో సహా పల్లెల్లోనూ యూత్ క్రికెట్ బెట్టింగ్స్ వైపే చూస్తుంటారు. 30 రోజుల వరల్డ్ కప్‌లో దేశమంతా రూ. లక్షన్నర కోట్ల వరకు బెట్టింగ్స్ జరగొచ్చన్న అంచనా ఉంది. ఇండియా, పాకిస్తాన్ ఒక్క మ్యాచ్‌కే రూ. 5వేల కోట్ల బెట్టింగ్స్ జరిగే అవకాశం ఉంది.

ఇన్‌బిల్ట్‌గా దోపిడీ

బెట్టింగ్ యాప్స్ అల్గారిథమ్ లోనే దోపిడీ ఇన్ బిల్ట్ గా ఉంటుంది. యూజర్ ను ఊరించి.. కొంత మొత్తంలో మొదట డబ్బులు ఇచ్చి.. ఆ తర్వాత భారీగా బెట్టింగ్ లు కాయించి ఓడిపోయేలా చేయడం, సర్వస్వం దోచుకోవడమే వీటి పని. అలానే డిజైన్ చేశారు.

డార్క్ వెబ్‌లో మన డేటా సేల్

బెట్టింగ్ నిర్వాహకులకు, సైబర్ నేరగాళ్లకు మధ్య ఒక చీకటి ఒప్పందం ఉంటుంది. బెట్టింగ్ ఒక భారీ 'డేటా మైనింగ్'. అన్ అఫీషియల్ బెట్టింగ్ యాప్ లేదా సైట్‌లో ఎవరైనా రిజిస్టర్ చేసుకున్నప్పుడు, తెలియకుండానే ఫోన్ నంబర్, ఈమెయిల్ ఐడీ, క్రెడిట్/డెబిట్ కార్డు వివరాలు బుకీల వద్దకు వెళ్లిపోతాయి. ఇలా సేకరించిన లక్షలాది మంది డేటాను బల్క్‌గా డార్క్ వెబ్‌లో అమ్ముకుంటారు. లోన్ యాప్స్ నిర్వాహకులకూ అమ్ముతారు. ఏపీకే ఫైల్స్ పంపే గ్యాంగ్‌లకు ఈ డేటా చాలా కీలకం. డేటా బ్రోకర్లు ఫోన్ నంబర్లు, ఈమెయిల్ ఐడీలను ప్యాకేజీలుగా అమ్ముతారు. 10వేల నంబర్లకు రూ.5వేల వరకు వసూలు చేస్తారు.

18-25 ఏళ్ల వారే 55%

బెట్టింగ్ యాప్స్ ఉచ్చులో చిక్కుకుంటున్న వారిలో ఎక్కువ మంది 18 నుంచి 25 ఏండ్ల మధ్య వయసు వారే.

ఏజ్	ఎంత శాతం	ఎలాంటి బెట్టింగ్స్
13-18	12-15%	పబ్జీ, ఫ్రీ ఫైర్
19-25	50-55%	ఐపీఎల్, ఫాంటసీ లీగ్‌లు, ఆన్‌లైన్ క్యాసినో
26-40	25%	ఆన్‌లైన్ రమ్మీ, పోకర్, బిట్కాయిన్లు
40+	5-10%	క్లబ్ బెట్టింగ్స్, కార్డు గేమ్స్

నేషనల్ క్రైమ్ రికార్డ్స్ బ్యూరో ప్రకారం.. గతేడాదితో ఆన్లైన్ బెట్టింగ్, గేమింగ్లో డబ్బు పోగొట్టుకుని ఆత్మహత్య చేసుకుంటున్న వారిలో 70 శాతం మంది 35ఏళ్లలోపు వారే. దేశవ్యాప్తంగా ఆన్లైన్ గేమింగ్ మరణాలలో తెలంగాణ, తమిళనాడు, కర్నాటక రాష్ట్రాలు మొదటి వరుసలో ఉన్నాయి.

ఎన్నో విషాదాలు..

ఐఫోన్ అమ్మి..!
హైదరాబాద్‌లో ఎంటెక్ చదివే గద్వాల జిల్లాకు చెందిన పవన్ బెట్టింగ్‌లకు అలవాటుపడ్డాడు. మొదట్లో లాభాయి వచ్చాయి. లక్ష రూపాయలు పెట్టాడు. నష్టపోయాడు. ఐ ఫోన్, బైక్ అమ్మి పెట్టినా నష్టాలొచ్చాయి. ఏప్రిల్‌లో ఆత్మహత్య చేసుకున్నాడు.

70 లక్షలు పోగొట్టుకొని..!
రూ.70 లక్షలు పోగొట్టుకుని అప్పుల పాలైన నిర్మల్ జిల్లాకు చెందిన ఫర్టిలైజర్ వ్యాపారి జాదవ్ ప్రేమ్ కుమార్ (39), ఈ ఏడాది జనవరి 24న పురుగుల మందు తాగి సూసైడ్ చేసుకున్నాడు.

బెట్టింగ్ యాప్స్ వలలో పడొద్దనీ..!
గచ్చిబౌలిలోని ఓ సాఫ్ట్‌వేర్ ఇంజనీర్ ఐపీఎల్ బెట్టింగ్‌లో రూ.40 లక్షలు పోగొట్టుకున్నాడు. చివరికి అపార్ట్‌మెంట్ పైనుంచి దూకి ఆత్మహత్య చేసుకున్నాడు.

చెల్లి పెళ్లి డబ్బులను తగలేసి..!
ఏపీలోని బాపట్ల జిల్లాలో ఒక యువకుడు చెల్లి పెండ్లి కోసం తండ్రి దాచిన రూ.5 లక్షలను తీసుకుని బెట్టింగ్ కాచాడు. ఆ డబ్బంతా పోగొట్టుకున్నాడు. పెండ్లికి వారం ముందు అసలు విషయం తెలియడంతో మనస్తాపంతో పురుగుల మందు తాగి ప్రాణాలు విడిచాడు.

ప్లీజ్.. వాటి జోలికి వెళ్లొద్దు

ఈజీగా డబ్బు సంపాదించాలనే దురాశ, ఆన్‌లైన్ బెట్టింగ్ వ్యసనాలే యువత నిండు ప్రాణాలను బలితీసుకుంటున్నాయి. అలాంటి మరణాలు కలచివేస్తున్నాయి. మిమ్మల్ని కని, పెంచి ప్రయోజకులను చేయాలని కష్టపడ్డ తల్లిదండ్రులకు మీరు ఇచ్చే బహుమతి ఇదేనా? సమస్యలకు, అప్పులకు ఆత్మహత్య పరిష్కారం కాదు. కష్టపడితేనే విజయం దక్కుతుంది తప్ప, షార్ట్ కట్స్‌లో వెళితే మిగిలేది విషాదమే. దయచేసి యువత గమనించాలి. ఆన్‌లైన్ బెట్టింగ్‌లకు దూరంగా ఉండండి. మీ ప్రాణం.. మీ కుటుంబానికి ఎంతో విలువైనది.

- వీసీ సజ్జనార్, హైదరాబాద్ పోలీస్ కమిషనర్

సెలబ్రెటీల ప్రమోషన్లు..

ఉచ్చులో యూత్!

యువతను ఆకట్టుకునేందుకు బెట్టింగ్ యాప్స్ ఎప్పుడూ సరికొత్తగా ఆలోచిస్తుంటాయి. రంగు రంగుల మాయాలోకాన్ని చూపిస్తుంటాయి. గేమింగ్ యాప్స్ మాత్రమేనంటూ చెప్పి సినీ నటులు, సెలబ్రిటీలతో ప్రచారం చేయిస్తుంటాయి. ఆ ప్రచారాన్ని నమ్మి యువత బెట్టింగ్స్ బారినపడుతున్నారన్న వాదనలు ఉన్నాయి. బెట్టింగ్ యాప్స్ తో సర్వస్వం కోల్పోయి ఆగమైన బతుకులకు ఈ సెలబ్రెటీలు ఏం సమాధానం చెప్తారని సోషల్ మీడియా వేదికగా నెటిజన్లు తీవ్ర విమర్శలు గుప్పిస్తున్నారు.

- బెట్టింగ్ యాప్స్ ను ప్రచారం చేసిన సెలబ్రిటీలపై ఇప్పటికే తెలంగాణ పోలీసులు కేసు నమోదు దర్యాప్తు చేస్తున్నారు. ఇందులోకి ఎన్ ఫోర్స్ మెంట్ డైరెక్టరేట్ (ఈడీ) కూడా ఎంటరై.. విచారణను ముమ్మరం చేసింది. ఈ కేసులో బాలీవుడ్, టాలీవుడ్ నటులు ఉన్నారు. విజయ్ దేవరకొండ, రానా దగ్గుబాటి, ప్రకాశ్ రాజ్, మంచు లక్ష్మి, నిధి అగర్వాల్ తోపాటు యాంకర్లు, యూట్యూబర్లపై గతంలో కేసులు నమోదయ్యాయి.
- తాను ప్రమోషన్ చేసిన ఏ23 స్కిల్ గేమింగ్ కొన్ని రాష్ట్రాల్లో అనుమతి ఉన్నచోట ప్రచారం అయ్యేలా అగ్రిమెంట్ చేసుకున్నానని.. అది బెట్టింగ్ యాప్ కాదని నటుడు విజయ్ దేవరకొండ చెప్పారు.
- లీగల్ టీమ్ అన్ని పరిశీలించిన తర్వాతే తాను అగ్రిమెంట్ చేసుకున్నానని, రూల్స్ ను ఉల్లంఘించలేదని నటుడు రానా తెలిపారు. స్కిల్ బేస్డ్ యాప్‌ను మాత్రమే ప్రమోషన్ చేశానని చెప్పారు.
- బెట్టింగ్ ప్రమోషన్ యాడ్‌లో నటించింది చాలా కాలం కిందటిదని, ప్రస్తుతం వాటితో తనకు సంబంధం లేదని ప్రకాశ్ రాజ్ అన్నారు. మళ్లీ అలాంటివాటి జోలికి తాను వెళ్లదలచుకోలేదని తెలిపారు.

242 బ్లాక్ చేసినా..

- 2026, జనవరి16న కేంద్ర ఐటీ మంత్రిత్వ శాఖ ఒకేసారి 242 బెట్టింగ్, గ్యాంబ్లింగ్ వెబ్‌సైట్లను/యాప్స్‌ను బ్లాక్ చేసింది.
- మహదేవ్ బుక్ (మనీలాండరింగ్), పరిమ్యాచ్, 1XBET, లోటస్ 365, ఫెయిర్‌ప్లే (భారత్ నుంచి అక్రమంగా నిధుల తరలింపు) యాప్స్ బ్యాన్ చేసింది.
- ఆన్‌లైన్ గేమింగ్, బెట్టింగ్‌పై అధికారికంగా నిషేధం ఉన్నప్పటికీ విదేశీ సర్వర్ల ద్వారా ఇల్లీగల్‌గా యాప్స్ నడుస్తున్నాయి.
- 1xBet, Parimatch, Dafabet: ఇవి క్రికెట్, ఫుట్‌బాల్ మ్యాచ్‌ల మీద బెట్టింగ్ కట్టేందుకు ప్రోత్సహిస్తున్నాయి.
- ఆన్‌లైన్ రమ్మీ, క్యాసినో: ఇవి స్కిల్డ్ గేమ్స్ అంటూ బెట్టింగ్స్ వైపు మళ్లిస్తున్నాయి.

చట్టాలు ఏం చెప్తున్నాయి?

- ఆన్‌లైన్ బెట్టింగ్ సైట్లను నిర్వహించే వారికి 3 ఏండ్ల జైలు, కోటి రూపాయల జరిమానా విధించే చాన్స్ ఉంది. సిక్కిం, గోవాలో నియంత్రిత పద్ధతిలో బెట్టింగ్‌కు అనుమతి ఉంది.
- యూఈఏలో బెట్టింగ్ నేరం. పట్టుబడితో 2 ఏండ్ల జైలు శిక్ష లేదా భారీ జరిమానా.
- సౌదీ అరేబియా, కతార్‌లో జూదం బెట్టింగ్ పెడితే జైలు శిక్షతో పాటు బహిరంగంగా కొరడా దెబ్బలు కొడ్తారు.
- దేశంలో పబ్లిక్ గ్యాంబ్లింగ్ యాక్ట్ – 1867 ప్రకారం.. బెట్టింగ్ అనేది నిషేధం. బెట్టింగ్ ఆడుతూ పట్టుబడితే జరిమానా, జైలు శిక్ష పడే అవకాశం ఉంది.

అత్యంత రహస్యమైన నెట్‌వర్క్

బెట్టింగ్ బుకీలు, వారి నెట్‌వర్క్ అనేది ఒక అత్యంత రహస్యమైన, వ్యవస్థీకృతమైన వ్యవస్థ. బుకీల్లో కూడా లెవల్స్ ఉంటాయి. ప్రైమరీ బుకీలు దుబాయ్, కరాచీ, లండన్ వంటి చోట్ల ఉండి పెద్ద పెద్ద నెట్‌వర్క్‌లను నడుపుతారు. లోకల్ బుకీలు.. మన నగరాలు, ఊళ్లల్లో ఉంటూ క్లయింట్ల నుంచి నేరుగా డబ్బులు వసూలు చేస్తారు. వీరు మెయిన్ బుకీలకు కమీషన్ కింద పని చేస్తారు. బుకీల నెట్‌వర్క్ పెద్దగా ఉంటుంది. టాప్ లెవల్ బుకీలు.. ఇంటర్నేషనల్‌గా రేట్లు నిర్ణయిస్తారు. వీరికి మాస్టర్ ఐడీలు ఉంటాయి. ఆ తర్వాత ఏజెంట్లు/పంటర్లు, లైన్ ప్రొవైడర్లు ఉంటారు. సాధారణంగా పందెం కాసేవాడు గెలిచినా.. ఓడిపోయినా.. బుకీకి మాత్రం నష్టం రాదు. వాళ్లు బిగ్ బుక్ అనే పద్ధతితో ప్రతి పందెం మీద కొంత కమీషన్ ముందే కట్ చేసుకుంటారు.

పేరెంట్స్ బీ అలర్ట్

- 25 ఏళ్ల లోపు యూత్ టార్గెట్‌గా బెట్టింగ్ దందాలు నడుస్తున్నాయి. దీనిపై తల్లిదండ్రులు తప్పనిసరిగా అలర్ట్ గా ఉండాలి.
- పిల్లలు పదేపదే ఫీజుల పేరు చెప్పో, పుస్తకాల పేరు చెప్పో డబ్బులడుగుతుంటే ఆరా తీయాలి.
- మానసికంగా కుంగిపోతున్నట్టు అనిపిస్తే తప్పకుండా ప్రేమగా అడిగి తెలుసుకోవాలి.
- పిల్లల ఫోన్ లో ఏమైనా బెట్టింగ్ యాప్స్ ఉన్నాయా అని ఒకటికిరెండు సార్లు గమనించాలి.
- ఒక ఫ్రెండ్ మాదిరి ట్రీట్ చేస్తూ.. వారికి సరైన గైడెన్స్ ఇవ్వాలి. మేమున్నామన్న భరోసా ఇవ్వాలి.
- అవసరమైతే కౌన్సెలింగ్ ఇప్పించాలి.

సైబర్ క్రైమ్ హెల్ప్‌లైన్
ఆన్‌లైన్ మోసాలకు గురైతే వెంటనే 1930కి కాల్ చేయొచ్చు. లేదా www.cybercrime.gov.inలో ఫిర్యాదు చేయొచ్చు.